RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | శుక్రవారం | పేజీలు : 6
సంపుటి : 4, సంచిక : 23 | డిసెంబర్ 26, 2025 | వెల : రూ.3-00



మరో అగ్రనేత హతం 4లో..



## 'సాఫ్ట్‌వేర్'లో వైరస్!

- ఐటీ ఉద్యోగుల్లో హెచ్ఐవీ మహమ్మారి
- సైలెంట్ గా విస్తరిస్తున్న ఎయిడ్స్
- బెంగళూరు తర్వాత రెండో స్థానంలో హైదరాబాద్
- స్పష్టం చేస్తున్న నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ రిపోర్ట్
- అపరిచితులతో డేటింగ్.. మల్టిపుల్ సెక్స్ పార్టనర్స్ వల్లే విజృంభణ
- వీకెండ్ పార్టీస్.. డ్రగ్స్ వాడకంతో విశృంఖలత్వం
- 'ఫ్లెండ్లీ వర్క్ కల్చర్'ను ప్రోత్సహిస్తున్న కొన్ని కంపెనీలు
- ఒక్కరాత్రి తప్పటడుగు.. దీర్ఘ కాలపు శిక్ష అంటున్న వైద్య నిపుణులు

3లో..

## సంతాలి భాషలో భారత రాజ్యాంగం విడుదల

- రాష్ట్రపతి భవన్‌లో ప్రత్యేక కార్యక్రమం
- ఓల్ చికీ లిపిలో రాజ్యాంగ ప్రతుల ఆవిష్కరణ
- సంతాలి ప్రజలకు గర్వకారణమన్న రాష్ట్రపతి



**న్యూఢిల్లీ, వేద న్యూస్ :**

రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతాలి భాషలో భారత రాజ్యాంగాన్ని విడుదల చేశారు. ఓల్ చికీ లిపిలో ముద్రితమైన ఈ రాజ్యాంగ ప్రతిని ఆవిష్కరించడం సంతాలి ప్రజలందరికీ గర్వకారణమని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ, భారత రాజ్యాంగం ఇప్పుడు సంతాలి భాషలో అందుబాటులోకి రావడం ఎంతో ఆనందకరమని అన్నారు. తమ స్వభాషలో రాజ్యాంగాన్ని చదివి అర్థం చేసుకునే అవకాశం మిగతా 3వ పేజీలో..

## సంఘటిత కృషి వల్లే కార్మిక హక్కులు అమలు

- కార్మికుల సంక్షేమం, సాధికారతకు బీఎంఎస్ కృషి ప్రశంసనీయం
- బీఎంఎస్ దత్తోపంత్ ఠెంగాడీ భవన్ ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- గాంధీనగర్‌లో నూతనంగా నిర్మించిన బీఎంఎస్ కార్యాలయ ఆవిష్కరణ
- ఆర్ఎస్ఎస్, బీజేపీ, కేంద్ర ప్రభుత్వ ప్రముఖుల హాజరు 3లో..

## నిద్రలోనే మృత్యు ఒడికి..

- కర్ణాటకలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధం
- 11 మంది సజీవ దహనం.. పలువురికి తీవ్ర గాయాలు
- లారీ ఢీకొనడంతో పేలిన డీజిల్ ట్యాంక్
- ప్రమాద సమయంలో బస్సులో 42మంది ప్రయాణికులు
- బస్సుల్లో ప్రయాణికుల భద్రతపై మరోసారి చర్చ



**వేద న్యూస్, బెంగళూరు ప్రతినిధి:**

దేశవ్యాప్తంగా వరుసగా జరుగుతున్న బస్సు ప్రమాదాలు ప్రజలను కలవరపెడుతున్న వేళ, కర్ణాటకలో మరో హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. కర్నూలు బస్సు ప్రమాదం, దుబాయ్‌లో అగ్నికి ఆహుతైన బస్సు ఘటన మరువకముందే, ఇప్పుడు కర్ణాటకలో ప్రయాణికులతో వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ప్రమాదానికి గురై పదకొండు మంది సజీవదహనం కావడం దేశవ్యాప్తంగా విషాదాన్ని మిగిల్చింది. ఈ ప్రమాదం చిత్రదుర్గం జిల్లా జవరగుండనహళ్లి శివారులోని సిరాహిరియూర్ జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో జరిగింది. బెంగళూరు నుంచి గోకర్ణం వైపు వెళ్తున్న సీబర్డ్ ట్రావెల్స్ బస్సు హోర్లథు క్రాసింగ్ సమీపంలో యూటర్న్ తీసుకుంటున్న సమయంలో ఎదురుగా వేగంగా వచ్చిన లారీ ఒక్కసారిగా ఢీకొట్టింది. లారీ నేరుగా బస్సు డీజిల్ ట్యాంక్‌ను తాకడంతో అది పేలి క్షణాల్లోనే మంటలు చెలరేగాయి. రెప్పపాటు వ్యవధిలో మంటలు బస్సు అంతా వ్యాపించాయి. ఆ సమయంలో ప్రయాణికులంతా గాఢ నిద్రలో ఉండటంతో చాలామందికి బయటపడే అవకాశం లేకుండా పోయింది. ముఖ్యంగా బస్సు వెనుక భాగంలో ఉన్న ప్రయాణికులు మంటల్లో చిక్కుకుని బయటకు రాలేకపోయారు. ఫలితంగా తొమ్మిది మంది అక్కడికక్కడే సజీవదహనం అయ్యారు. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 42 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. మంటలు చెలరేగిన వెంటనే మిగతా 3వ పేజీలో..

## క్రిస్మస్ వేడుకల్లో మంత్రి కోమటిరెడ్డి

- సెంటినరీ బాప్టిస్ట్ చర్చిలో క్రిస్మస్ సంబరాలు
- క్రైస్తవ సోదర సోదరీమణులతో కలిసి వేడుకల్లో భాగస్వామ్యం
- ప్రేమ, శాంతి, సేవ మార్గంలో సమాజం ముందుకు సాగాలని ఆకాంక్ష

**వేద న్యూస్, నల్లగొండ:**



నల్లగొండ క్లాక్‌టవర్ సెంటర్‌లోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రైస్తవ సోదర సోదరీ మణులతో కలిసి ఆనందంగా క్రిస్మస్ సంబరాల్లో భాగమయ్యారు. ఈ సందర్భం గా మంత్రి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరికీ యేసు ప్రభువు కృపతో సుఖశాంతులు కలగాలని ఆకాంక్షించారు. క్రిస్మస్ పర్వదినం ప్రేమ, క్షమ, మానవత్వం వంటి విలువలను సమాజానికి గుర్తు చేస్తుందని పేర్కొన్నారు. ప్రేమ, శాంతి, సేవ మార్గంలో సమాజం ముందుకు సాగాలని, అన్ని వర్గాల ప్రజలు పరస్పర గౌరవంతో, ఐక్యతతో జీవించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆకాంక్షించారు. క్రిస్మస్ వేడుకలు సమాజంలో సౌహార్దం, సోదరభావాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో చర్చి ప్రతినిధులు, స్థానిక నాయకులు, విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

## లోన్ మాఫీ కోసం భర్తను చంపేసింది

- ప్రియుడితో కలిసి హతమార్చిన భార్య
- రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం
- బోరున విలపించిన భార్యే హంతకురాలని తేల్చిన ఖాకీలు



**వేద న్యూస్, మహబూబాబాద్:**

సినిమా కథలను కూడా మించిపోయే సంచలనాత్మక నేరకథ మహబూబాబాద్ జిల్లాలో వెలుగుచూసింది. హౌస్ లోన్ మాఫీ కావాలన్న దురాశతో ప్రియుడితో కలిసి భర్తను పక్కా స్కెచ్ వేసి హతమార్చిన భార్య వ్యవహారం పోలీసుల దర్యాప్తులో బయటపడింది. భర్తను చంపించిన తరువాత అదే శవం వద్ద లబోదిబోమంటూ విలపించిన ఆ మహిళే అసలు హంతకురాలని ఖాకీలు తేల్చడంతో గ్రామమంతా షాక్‌కు గురైంది. ఈ నెల 22వ తేదీన కేసముద్రం మండలం బోడమంచతండా సమీపంలో భూక్యా వీరన్న అనే కౌలు రైతు అనుమానాస్పదంగా మృతి చెందాడు. రోడ్డు పక్కన మృతదేహం, దానిపై బైక్ పడేసి ఇది రోడ్డు ప్రమాదమన్నట్లుగా సీన్ క్రియేట్ చేశారు. చూసిన ఎవరికైనా ఇది యాక్సిడెంట్ అనిపించేలా పక్కా ప్లాన్ అమలు చేశారు. అయితే మృతదేహం చుట్టూ కనిపించిన రక్తపు మరకలు, శవాన్ని పొలం వైపు ఈడ్చుకువచ్చిన ఆనవాళ్లు ఈ ఘటన వెనుక ఘోర హత్య దాగి మిగతా 3వ పేజీలో..

# ప్రభుత్వ భూమిని కాపాడిన రెవెన్యూ అధికారులు

- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు
- సర్కార్ భూమిని కబ్జా చేస్తే చర్యలు తప్పవు
- తహసీల్దార్ హేమలత





**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**

వేములపల్లి మండల కేంద్రంలోని ఆమనగల్లు గ్రామంలో సర్వేనెంబర్ 1లో గ్రామానికి చెందిన కొంత మంది వ్యక్తులు అక్రమంగా భూమిని కబ్జా చేసి రాళ్లతో కంచె ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం విషయం తెలుసుకున్న వేములపల్లి తహసీల్దార్ ఘటన స్థలానికి సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కాగా, నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా భూమిని కబ్జా చేసిన రాళ్లను తొలగించారు. దీంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ హేమలత మాట్లాడుతూ.. మండలంలో ఎవరైనా అక్రమంగా భూమిని కబ్జా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంతటి వారినైనా ఉపేక్షించమని పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిని కాపాడే బాధ్యత ప్రతి పౌరునిపై ఉందన్నారు. ఈ సందర్భంగా బాధితులు దేశబోయిన వెంకటయ్య మాట్లాడుతూ.. పూర్వం నుంచి బొందలగడ్డ మా తెలగ కుటుంబాలు కబ్జాలో ఉన్నాయని ఆరోపించారు. సర్వే నెంబర్ 1లో చాలామంది భూమిని అన్యాక్రాంతం చేశారని పేర్కొన్నారు. సర్వే నెంబర్ 1 లో ఆక్రమించుకున్న గడ్డివాములను తొలగించాలని కోరారు. ఆమనగల్లు గ్రామంలో ఎంతోమంది ప్రభుత్వ భూమి కబ్జా చేశారు. వాటిని కూడా స్వాధీనం చేసుకోవాలని అన్నారు.

# మెదక్ చర్చి వద్ద భారీ బందోబస్తు

- పరిశీలించిన అదనపు ఎస్పీ మహేందర్




**వేద న్యూస్, మెదక్ జిల్లా:**

మెదక్ పట్టణంలోని ప్రసిద్ధ మెదక్ చర్చ్ వద్ద క్రిస్మస్ పండుగ సందర్భంగా భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చే నేపథ్యంలో జిల్లా పోలీస్ శాఖ విస్తృత బందోబస్తు ఏర్పాట్లు చేపట్టింది. ఈ బందోబస్తు ఏర్పాట్లను మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ గురువారం స్వయంగా పరిశీలించారు. చర్చ్ పరిసర ప్రాంతాలు, ప్రధాన ప్రవేశ ద్వారాలు, పార్కింగ్ ప్రాంతాలు, రహదారులపై అమలు చేస్తున్న భద్రతా చర్యలను సమీక్షించి, విధుల్లో ఉన్న పోలీస్ అధికారులకు తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని, మహిళలు, వృద్ధులు, చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేసి, నిరంతర పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. సీసీటీవీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ చేపట్టి, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నామని తెలిపారు. క్రిస్మస్ వేడుకలు శాంతియుతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉందని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రజలు పోలీస్ శాఖకు సహకరించి, శాంతి వాతావరణం లో క్రిస్మస్ పండుగను జరుపుకోవాలని అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ కోరారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ గారి వెంట మెదక్ డియస్పి ప్రసన్న కుమార్, ఏఆర్ డియస్పి రంగా నాయక్, మెదక్ టౌన్ ఇన్స్పెక్టర్ మహేష్, ఆర్ఐ శైలందర్, ఎస్సై లు సిబ్బంది ఉన్నారు.

# ఏళ్లు గడిచినా రోడ్డు వేయరా?




- స్మార్ట్ సిటీ పేరా కోట్ల రూపాయల దోపిడి
- ప్రజల బాధలు పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్

**వేద న్యూస్, కరీంనగర్:**

కరీంనగర్ నగరంలోని కట్ట రాంపూర్ నుంచి కోతి రాంపూర్ వెళ్లే రహదారి గతకొన్ని సంవత్సరాలుగా వాహనాలు, పాదాచారులు నడవలేని దుస్థితిలో ఉందని దీనిని బాగు చేయడంలో మున్సిపల్ అధికారులు పూర్తిగా విఫలం చెందారని సీపీఐ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధ్వానంగా ఉన్న కటరాంపూర్ నుంచి కోతి రాంపూర్ వెళ్లే గుంతలుగా ఉన్న రోడ్డును గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. కరీంనగర్ నగరంలో పైన పటారం లోన లొటారంలాగా రోడ్ల నిర్మాణం జరుగుతుందని, ప్రధాన రహదారులను బాగు చేస్తున్నారు తప్ప అంతర్గత రహదారులను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆరోపించారు. అధ్వానంగా ఉన్న రహదారులను మరమ్మతులు చేపించడంలో మున్సిపల్ అధికారులు ఘోరంగా విఫలమయ్యారని ఇంత అధ్వానంగా ఉన్న రోడ్డును బాగు చేపించడంలో కమిషనర్ నిర్లక్ష్యం వహించడం సిగ్గుచేటని మండిపడ్డారు. స్మార్ట్ సిటీలో నిధులు పెట్టాం రోడ్డు వేస్తామని ప్రజలకు అబద్ధపు మాటలు చెప్పి కాలయాపన చేశారని గతంలోని ప్రజాప్రతినిధులు దీనిని ఏమాత్రం పట్టించుకోకపోవడం విడ్డూరం అన్నారు. వందల కోట్ల నిధులు స్మార్ట్ సిటీ నుంచి వచ్చాయని, రోడ్లను అభివృద్ధి చేస్తున్నామని చెప్పుతున్నారని.. ఆచరణలో మాత్రం లేదన్నారు. కరీంనగర్లో చాలా వీధుల్లో ఇలాంటి దుస్థితే ఉందని, ఇది మచ్చుకేనని మున్సిపల్ అధికారులు ఇంత నిర్లక్ష్యంగా రహదారులపై వ్యవరించడం దారుణమని అన్నారు. వెంటనే ఈ రహదారి పనులను, నగరంలో అధ్వానంగా మధ్యలో వదిలిపెట్టిన రోడ్లను వెంటనే పనులు ప్రారంభించి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. లేనిపక్షంలో నగరంలోని ప్రజలతో మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని పంజాల శ్రీనివాస్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు న్యాలపట్ల రాజు, కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, కసిరెడ్డి మణికంఠ రెడ్డి, నగర కార్యవర్గ సభ్యులు కసిబోజుల సంతోష చారి, గామినేని సత్యం, అనంతగిరి, రమేష్ మాదాసు రాములు, శంకర్ సందీప్ నాగరాజు బ్రహ్మం, శ్రీ వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# వాజ్ పేయి జయంతి సందర్భంగా గుడ్ గవర్నెన్స్ డే



**వేద న్యూస్, చొప్పదండి :**

నెహ్రూ యువ కేంద్ర మరియు నవతరం యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అటల్ బిహారీ వాజపేయ జయంతి సందర్భంగా గుడ్ గవర్నెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక శ్రీ చైతన్య కళాశాలలో గుడ్ గవర్నెన్స్ డే కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ రత్నాకర్ అటల్ బిహారీ వాజపేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణ, నవతరం యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు జాగిరి సాయిగణేష్, చల్ల అనూష్, కొత్త అఖిల్, వరుణ్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.


# వేద ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో మెటీరియల్స్ పంపిణీ



**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండల కేంద్రంలో గల కస్తూర్బా గాంధీ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులకు వేద ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ ఇందూర్ విజయభాస్కర్ సహకారంతో రుద్రూర్ గ్రామ సర్పంచ్ ఇందూర్ సునీత చంద్రశేఖర్ చేతుల మీదుగా ఐఐటీ, జేఈఈ, ఎన్ఈఈటీ మెటీరియల్స్ ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ షేక్ నిస్సార్, శ్రీకాంత్ గౌడ్, రాజా గౌడ్, పార్వతి శేఖర్, ప్రిన్సిపాల్ శ్యామల, భోధన సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# తరతరాలకు వాజ్ పేయి జీవితం ఆదర్శం



- బీజేపీ మండల అధ్యక్షుడు పరశురామ్

**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం బీజేపీ బోయినిపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు ఎడపల్లి పరశురామ్ నాయకత్వంలో ఘనంగా మాజీ ప్రధాని వాజ్ పేయి జయంతి వేడుకలు నిర్వహించారు. గొప్ప కవిగా, దేశభక్తుడిగా, దేశం కోసం అహర్నిశలు శ్రమించిన వ్యక్తి, భారతరత్న అటల్ జీ అని కొనియాడారు. తరతరాలకు అటల్ జీ జీవితం స్ఫూర్తి అన్నారు. భారతరత్న వాజ్ పేయి జయంతి రోజున సుపరిపాలన దినోత్సవంగా కేంద్రప్రభుత్వం ప్రకటించిందన్నారు. అటల్ జి, ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థంబంపల్లి సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్, మాజీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్ రెడ్డి, సినీయర్ నాయకులు క్యాతం తిరుపతిరెడ్డి, జువ్వెంతుల శ్రీనివాసరెడ్డి, మెరుపుల గంగాధర్, గంగాధర్ చారి, స్వామి కుమార్, కిరణ్ రాజురి, సారంపల్లి రాజు, ఇల్లందుల బాలయ్య, కళ్యాణ అనిల్, సావన్పల్లి అనిల్, విజయేందర్ రెడ్డి, రజనీకాంత్, రమేష్, ప్రసాద్, సాయికుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ చర్చ్‌లో భారీ బందోబస్తు

- పరిశీలించిన జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు




**వేద న్యూస్, మెదక్ జిల్లా:**

ప్రసిద్ధ మెదక్ చర్చ్‌లో ఏర్పాటు చేసిన క్రిస్మస్ బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు స్వయంగా పరిశీలించారు. క్రిస్మస్ వేడుకల సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు చర్చ్‌కు తరలివచ్చే అవకాశం ఉన్నందున, శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా చర్చ్ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పోలీస్ పికెట్లు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలను సమీక్షించారు. అనంతరం కమాండ్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించి, అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. చర్చ్ ప్రాంగణం, ప్రధాన ప్రవేశ ద్వారాలు, పార్కింగ్ ప్రాంతాలు, పరిసర రహదారులపై నిరంతర నిఘా కొనసాగించాలని సిబ్బందికి సూచించారు. విధి నిర్వహణలో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. అలాగే మహిళలు, పిల్లల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పండుగ వాతావరణంలో ప్రజలు శాంతియుతంగా వేడుకలు నిర్వహించుకునేందుకు పోలీస్ శాఖకు పూర్తి స్థాయిలో సహకరిం చాలని జిల్లా ఎస్పీ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గారితో పాటు అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీలు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, రంగా నాయక్, సీఐలు రాజశేఖర్ రెడ్డి, మహేష్, సందీప్ రెడ్డి, కృష్ణమూర్తి, రంగ కృష్ణ, అలాగే ఎస్సైలు మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు పోలీస్ చర్యలు



**వేద న్యూస్, గంగాధర:**

కరీంనగర్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు, గంగాధర మండల పరిధిలోని కరీంనగర్–జగిత్యాల జాతీయ రహదారి (ఎన్ హెచ్ –563)పై పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు గంగాధర ఎస్సై వంశీకృష్ణ ప్రత్యేక చర్యలు చేపట్టారు. మండలంలోని కొండన్నపల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారి వెంబడి రోడ్డు ప్రక్కన అధికంగా పెరిగిన పిచ్చి చెట్లు, మొక్కల కారణంగా వాహనదారులకు ఎదురుగా వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించకపోవడం, అలాగే రహదారి వెడల్పు తగ్గిపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నట్లు పోలీస్ అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో ట్రాక్టర్ల సహాయంతో రహదారి పక్కన పెరిగిన చెట్లు, పిచ్చి మొక్కలు, ఇతర అడ్డంకులను తొలగించి రహదారిని పూర్తిగా చదును చేశారు. ఈ చర్యలతో వాహనదారులకు స్పష్టమైన దృష్టి లభించడంతో పాటు, రహదారిపై అనవసర అవరోధాలు తొలగి ప్రమాదాల సంఖ్య తగ్గే అవకాశముందని పోలీసులు తెలిపారు. రోడ్డు భద్రతకు ప్రజలు సహకరించాలని, వాహనాలు నడుపుతున్నప్పుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని గంగాధర ఎస్సై వంశీకృష్ణ వాహనదారులకు సూచించారు.

# రాజన్న సన్నిధిలో పిచ్చికుక్క స్వైరవిహారం

- దర్శనానికి వచ్చిన 21 మంది భక్తులకు గాయాలు



**వేద న్యూస్,వేములవాడ:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వర స్వామి క్షేత్రంలో భక్తులు భయాందోళనకు గురయ్యారు. పుణ్యక్షేత్రంలో ఒక పిచ్చికుక్క స్వైరవిహారం చేస్తూ కంటబడిన వారందరిపై దాడికి తెగబడింది. ఈ ఘటనలో స్వామివారి దర్శనానికి వచ్చిన సుమారు 21 మంది భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. రాజన్న దర్శనం కోసం రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు జాతర గ్రౌండ్ సమీపంలో ఉండగా, ఒక్కసారిగా పిచ్చికుక్క వారిపై దాడి చేసింది. పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా వెంటాడి మరీ కరవడంతో అక్కడ ఒక్కసారిగా కలకలం రేగింది. గాయపడిన వారందరినీ వెంటనే చికిత్స నిమిత్తం వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. జాతర గ్రౌండ్ మరియు చుట్టుపక్కల ప్రాంతాల్లో వీధి కుక్కలు, పిచ్చికుక్కలు విచ్చలవిడిగా తిరుగుతున్నాయని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నేతలు



**వేద న్యూస్, దామరచర్ల :**

దామరచర్ల మండల కేంద్రంలో జరిగిన క్రిస్మస్ వేడుకలలో గురువారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు గాజులు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బంటు కిరణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రవితేజ, నాగునాయక్, కందుల శ్యామ్ సుందర్ రెడ్డి, గోవిందరెడ్డి, బిఎల్ఆర్ బ్రదర్స్ పూర్ణ చంద్ర రావు వార్డు సభ్యులు సైది రెడ్డి , జానకిరామ్ రెడ్డి, లింగారెడ్డి, రాజగట్టు సర్పంచ్ సంజీవ్, , కామిశెట్టి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.




- ఐటీ ఉద్యోగుల్లో హెచ్ఐవీ మహమ్మారి
- సైలెంట్ గా విస్తరిస్తున్న ఎయిడ్స్
- బెంగళూరు తర్వాత రెండో స్థానంలో హైదరాబాద్
- స్పష్టం చేస్తున్న నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ రిపోర్ట్
- అపరిచితులతో డేటింగ్.. మల్టిపుల్ సెక్స్ పార్టనర్స్ వల్లే విజృంభణ
- వీకెండ్ పార్టీస్.. డ్రగ్స్ వాడకంతో విశృంఖలత్వం
- 'ఫ్రెండ్లీ వర్క్ కల్చర్'ను ప్రోత్సహిస్తున్న కొన్ని కంపెనీలు
- ఒక్కరాత్రి తప్పటడుగు.. దీర్ఘ కాలపు శిక్ష అంటున్న వైద్య నిపుణులు

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి:**

ఎయిడ్స్ మహమ్మారి మళ్లీ విజృంభిస్తోంది. ఇప్పుడు కొత్త రూపంలో సైలెంట్ గా విస్తరిస్తోంది. ఒకప్పుడు ఇది ఎక్కడో రూరల్, లేబర్ వర్క్ ఏరియా సమస్యగా భావించబడినా.. ఇప్పుడు పట్టణాల గుండెల్లోకి, అద్దాల ఆఫీసుల్లోకి శరవేగంగా దూసుకొస్తోంది. మొత్తంగా రాష్ట్రంలో హెచ్ఐవీ కేసులు మళ్లీ ఆందోళనకర స్థాయికి చేరుతున్నాయనే హెచ్చరికలు ఇటీవలి కాలంలో తరచూ వినిపిస్తున్నాయి. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (ఎన్ఏసీఓ), రాష్ట్ర వైద్య శాఖ గణాంకాలు, ఇటీవల నమోదవుతున్న కేసులను బట్టి చూస్తే ఒక చేదు నిజం స్పష్టంగా అర్థమవుతోంది. ఎయిడ్స్ అనేది ఇక గ్రామీణ సమస్య మాత్రమే కాదు, పట్టణ జీవనశైలికి అంటుకున్న ప్రమాదం. ఈ క్రమంలోనే రాష్ట్ర రాజధాని హైదరాబాద్ దేశంలోనే రెండో స్థానంలో ఉండటం కలవరపెట్టే అంశం. న్యాకో(ఎన్ఏసీఓ) రిపోర్ట్ ప్రకారం.. బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, ముంబై, ఢిల్లీ వంటి మెట్రోపాలిటిన్ సిటీస్ ఎయిడ్స్ వ్యాప్తిలో వరుసగా ఉన్నాయి. కాగా, తెలంగాణలో 2025లో 8.21లక్షల స్క్రీనింగ్లలో 5,517 కొత్త కేసులు గుర్తించబడడం ఆందోళన కలిగిస్తోంది. వీరిలో ఎక్కువగా హైదరాబాద్ సాఫ్ట్ వేర్ ఎంప్లాయీస్ ఉండడం షాక్ కు గురిచేస్తోంది..

**– సాఫ్ట్‌వేర్ నగరానికి అంటుకున్న వైరస్**

హైదరాబాద్ అంటే టెక్నాలజీ, గ్లోబల్ కంపెనీలు, ఐటీ ఉద్యోగాలు, వేల కోట్ల పెట్టుబడులు, లక్షల మంది యంగ్ ఎంప్లాయీస్.. కానీ అదే నగరం ఇప్పుడు హెచ్ఐవీ కేసుల్లో ముందువరుసలో ఉండటం కలవరపెట్టే అంశం. ఇటీవల వెలుగులోకి వచ్చిన కథనాల ప్రకారం, కొత్తగా నమోదవుతున్న హెచ్ఐవీ కేసుల్లో గణనీయమైన శాతం సాఫ్ట్‌వేర్, ఐటీఈఎస్ రంగాల్లో పనిచేసే వారిలోనే కనిపిస్తోంది. అంతేకాదు.. మెట్రో సిటీస్ లో యువత సంఖ్య ఎక్కువ. ఉద్యోగం, కెరీర్ ఒత్తిళ్లు, ఒంటరి జీవనం, నైట్ షిఫ్ట్‌లు, ఫాస్ట్ లైఫ్ స్టైల్.. ఇవి అన్నీ కలిసి వ్యక్తిగత ఆరోగ్యంపై నిర్లక్ష్యాన్ని పెంచుతున్నాయి. సేఫ్ బిహేవియర్ పట్ల అవగాహన ఉన్నట్టే కనిపించినా, ఆచరణలో లోపం స్పష్టంగా కనిపిస్తోంది. ఇదే ఎయిడ్స్ వ్యాప్తికి అనుకూల వాతావరణంగా మారుతోందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

**– వీకెండ్ పార్టీస్.. డ్రగ్స్ వాడకం..**

హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లో హెచ్ఐవీ కేసులు పెరగడానికి వీకెండ్ పార్టీల సంస్కృతి ఒక ప్రధాన కారణంగా మారుతోందన్న అభిప్రాయం వైద్య నిపుణుల నుంచి వ్యక్తమవుతోంది. వారంతపు పని ఒత్తిడికి బ్రేక్‌గా జరిగే నైట్ పార్టీల్లో ఆల్కహాల్ వినియోగం, కొందరిలో డ్రగ్స్ వాడకం ఎక్కువవుతుండటంతో మత్తులో తీసుకునే నిర్ణయాలు ప్రమాదకరంగా మారుతున్నాయి. ఈ మత్తుల్లో సురక్షిత లైంగిక చర్యలపై అవగాహన తగ్గి, కండోమ్ వాడకం విస్మరించటం, మల్టిపుల్ పార్టనర్స్ తో సెక్స్ చేయడం వల్లే ఈ పరిణామాలు వచ్చాయని ఆరోగ్యశాఖ వర్గాలు హెచ్చరిస్తున్నాయి.

**– డబుల్ ఇన్‌కమ్.. డబుల్ దూరం..**

ఇప్పుడున్న కుటుంబ జీవితం కూడా ఎయిడ్స్ వ్యాప్తికి కారణమనే వాదనలూ వినిపిస్తున్నాయి. జీవితం మారిపోయింది. భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగాలు చేస్తున్నారు. ఉదయం ఎవరి ఆఫీసులకు వారు, రాత్రి ఎవరి షిఫ్ట్‌లు వారు వెళ్తున్నారు. చేతినిండా డబ్బు కనిపిస్తుంది.. కానీ సమయమే లేదు. లైఫ్ పార్ట్‌నర్‌తో అన్యోన్యంగా గడపాల్సిన క్షణాలు తగ్గిపోతున్నాయి. భావోద్వేగ అనుబంధంలో ఖాళీ ఏర్పడుతోంది. ఆ ఖాళీని పూడ్చుకోవడానికి కొందరు బయట సంబంధాల వైపు అడుగులు వేస్తున్నారని ఇటీవల సర్వేలే చెబుతున్నాయి. డిజిటల్ ప్రపంచంలో విచ్చలవిడిగా డేటింగ్ యాపులు పుటుకురావడం.. వారిచ్చే ఫెసిలిటీస్ కు లొంగడంతో ఐటీ ఉద్యోగుల్లో హెచ్ఐవీ వ్యాప్తికి వేగం పెంచుతున్నదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**– ఒక్కరాత్రి పరిచయం.. దీర్ఘకాల శిక్ష**

హైదరాబాద్లో ఎయిడ్స్ వ్యాప్తికి ప్రధాన కారణం ఎక్కువ సేపు పని గంటలు, నైట్ షిఫ్ట్‌ల్లో ఉద్యోగాలు. కాబట్టి ఒత్తిడి నుంచి ఉపశమనం కోసం సురక్షితం కానీ అఫైర్స్ పెట్టుకుంటున్నరు. క్యాజువల్ రిలేషన్‌షిప్స్ ప్రతి సంవత్సరం పెరుగుతున్నాయి. నాకేమీ కాదన్న భ్రమతో రెగ్యులర్ హెల్త్ చెకప్‌లకు దూరంగా ఉండటం వల్లే పరిణమాలు ఈ స్థాయికి వచ్చాయనేది స్పష్టం చేస్తోంది. మానసిక అలసటను తాత్కాలిక ఆనందంతో మర్చిపోవాలనే ప్రయత్నమే ప్రమాదానికి ఆహ్వానంగా మారుతోంది. అపరిచితులతో సంబంధాలు, ఒక్క రాత్రి పరిచయాలు.. ఇవి క్షణిక ఉపశమనం ఇస్తున్నాయేమో కానీ, దీర్ఘకాల శిక్షగా మారుతున్నాయి.

**– ఫ్రెండ్లీ వర్క్ కల్చర్ అంటూ..**

ఇంకా ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే.. కొన్ని సాఫ్ట్‌వేర్ కంపెనీలు అంతర్గతంగా డేటింగ్‌లను ప్రోత్సహిస్తున్నాయనే ప్రచారం కూడా జరుగుతోంది. ఫ్రెండ్లీ వర్క్ కల్చర్ పేరుతో ఏర్పడుతున్న సన్నిహిత వాతావరణం వల్ల పరిస్థితి శృతిమించిన శారీరక సంబంధాలకు దారితీస్తున్నాయి. వర్క్ ప్లేస్‌లో ఆరోగ్య అవగాహన, బాధ్యతాయుత ప్రవర్తనపై స్పష్టమైన మార్గదర్శకాలు లేకపోవడం కూడా ఒక కారణంగా మారుతోంది. ఇలాంటి పరిస్థితులు నియం త్రణ లేకపోతే ఎంత ప్రమాదకరమో ఇప్పుడు బయటప డుతోంది.మౌనంగా వ్యాప్తి చెందుతున్న వైరస్ఎయిడ్స్ ప్రమాదకరం కావడానికి మరో ప్రధాన కారణం.. ప్రారంభ దశలో లక్షణాలు కనిపించకపోవడం. చాలా మంది పరీక్షలు చేయించుకోకుండా, తెలియకుండానే ఇతరులకు వైరస్ వ్యాప్తి చేసే ప్రమాదం ఉంది. ఎక్కువ మంది పరీక్షలకు భయపడటం, సమాజం ఏమనుకుంటుందో అన్న ఆలోచన వల్ల చాలామంది చివరి దశలోనే ఆస్పత్రులకు వస్తున్నారు. అప్పటికే జీవితం పూర్తిగా మారిపోతుంది. అయితే.. వీకెండ్ పార్టీస్, డ్రగ్స్, పబ్ కల్చర్, మల్టిపుల్ పార్ట్నర్స్ తో సెక్స్ అలవాట్లు ఉన్నవారు అవగాహనతో పరీక్షలు చేయించుకుంటే మొదట్లోనే సరైన చికిత్సలు అందే అవకాశం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

# నిద్రలోనే మృత్యు ఒడికి..



కొంతమంది ప్రయాణికులు కిటికీలు, తలుపుల ద్వారా బయటపడగలిగారు. అయినప్పటికీ తీవ్రంగా గాయపడిన పన్నెండు మందిని పోలీసులు, స్థానికులు సమీపంలోని సిరా, హిరియూర్ ఆస్పత్రులకు తరలించారు. కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పూర్తిగా కాలిపోయిన బస్సు నుంచి మృతదేహాలను వెలికితీశారు. ప్రమాదానికి లారీ డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రధాన కారణమై ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. మంటల్లో దగ్ధమైన బస్సు దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో దేశవ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తమవుతోంది. తాజా ప్రమాదంతో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల్లో ప్రయాణికుల భద్రతపై మరోసారి పెద్ద చర్చ మొదలైంది. రాత్రివేళ ప్రయాణాలు, యూటర్న్‌ల వద్ద వేగం, వాహనాల సేఫ్టీ ప్రమాణాలు, డీజిల్ ట్యాంకుల రక్షణ వంటి అంశాలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. చిత్రదుర్గలో జరిగిన బస్సు ప్రమాదంపై ప్రధానమంత్రి కార్యాలయం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొంది. ప్రమాదంలో మరణించిన వారికి ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి రూ. 2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. గాయపడిన వారికి రూ. 50వేలు ఇవ్వనున్నట్లు ప్రధాని కార్యాలయం వెల్లడించింది.

# సుపరిపాలన దినోత్సవానికి అటల్ జీ జీవితం ప్రతీక

- అమరావతి నిర్మాణానికి మహానేత స్ఫూర్తి మార్గదర్శకం
- అటల్ జీ విగ్రహావిష్కరణలో చంద్రబాబు

**వేద న్యూస్, అమరావతి ప్రతినిధి:**

భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని సుపరిపాలన దినోత్సవంగా పాటించడం ఆయన జీవిత విలువలకు తగిన గౌరవమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. అటల్ జీ 101వ జయంతి సందర్భంగా అమరావతి సమీపంలోని వెంకటపాలెంలో ఏర్పాటు చేసిన అటల్ జీ విగ్రహాన్ని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్తో కలిసి సీఎం చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. అటల్ జీ జీవితం సుపరిపాలనకు, ప్రజాసేవకు ఒక జీవంత మార్గదర్శకమని పేర్కొన్నారు. నిజాయితీ, వినయం, దూరదృష్టి వంటి విలువలను ఆచరణలో చూపిన నాయకుడు అటల్ బిహారీ వాజ్‌పేయి అని గుర్తు చేశారు. ఆయన ఆశయాలు, ఆదర్శాలు తరతరాలకు ప్రేరణగా నిలుస్తాయని అన్నారు. రాజధాని అమరావతి నిర్మాణంలో అటల్ జీ స్ఫూర్తి ఎప్పటికీ దారిదీపమని ముఖ్యమంత్రి తెలిపారు. వెంకటపాలెంలో ఏర్పా టు చేసిన అటల్ జీ విగ్రహం సుపరిపాలన, ప్రజాహిత పాలనకు శాశ్వత ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. అటల్ జీ జీవితం, ఆయన బోధనలు ప్రజాసేవలో నిబద్ధత, కరుణ, దూరదృష్టితో పని చేయాలని ప్రతి ఒక్కరికీ సందేశం ఇస్తాయని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ దేశాభివృద్ధికి అంకితంగా పనిచేయడమే అటల్ జీకి నిజమైన నివాళి అని స్పష్టం చేశారు.



# సంతాలి భాషలో భారత రాజ్యాంగం విడుదల

సంతాలి ప్రజలకు కలుగుతుందని, ఇది ప్రజాస్వామ్య విలువలను మరింత బలపరుస్తుందని తెలిపారు.సంతాలి భాషలో, ఓల్ చికీ లిపిలో రాజ్యాంగం విడుదల కావడం ద్వారా సంతాలి ప్రజల్లో చట్టస్పృహ, హక్కులపై అవగాహన మరింత పెరుగుతుందని రాష్ట్రపతి విశ్వాసం వ్యక్తం చేశారు. దేశ వైవిధ్యాన్ని గౌరవిస్తూ, ప్రతి భాషకు సమాన గౌరవం ఇవ్వడమే భారత రాజ్యాంగ ఆత్మ అని ఆమె స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, అధికారులు పాల్గొనగా, సంతాలి భాషాభిమానులు ఈ నిర్ణయాన్ని హర్షాతిరేకాలతో స్వాగతించారు.

# సంఘటిత కృషి వల్లే కార్మిక హక్కులు అమలు

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**



కార్మిక హక్కులు, సం క్షేమ పథకాలు సమర్థం గా అమలవ్వాలంటే సంఘ టిత కృషి అవసరమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. గాంధీనగర్‌లో నూతనంగా నిర్మించిన భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) కార్యాలయం 'దత్తోపంత్ ఠెంగాడీ భవన్' ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఎంఎస్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, దేశవ్యాప్తంగా కార్మికుల సంక్షేమం, సాధికారత కోసం సంస్థ నిరంతరం చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. దేశ అభివృద్ధిలో కార్మికుల పాత్ర కీలకమని, వారి శ్రేయస్సే బలమైన ఆర్థిక వ్యవస్థకు పునాదిగా నిలుస్తుందని అన్నారు. ఈ దిశగా బీఎంఎస్ పోషిస్తున్న పాత్ర ప్రశంసనీయం అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ సర్కార్యవాహ్ దత్తా హోసబాలే, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ తదితర ప్రముఖులు హాజరయ్యారు. కార్యక్రమం ఘనంగా సాగగా, కార్మిక సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బీఎంఎస్ కార్యాలయం ప్రారంభంతో కార్మిక ఉద్యమాలకు మరింత బలం చేకూరుతుందని, కార్మికుల సమస్యల పరిష్కారానికి ఇది కేంద్రబిందువుగా నిలుస్తుందని నాయకులు అభిప్రాయపడ్డారు.

# లోన్ మాఫీ కోసం భర్తను చంపేసింది

ఉందన్న అనుమానాలను బలపరిచాయి. మృతుడు ఇదే తండాకు చెందినవాడని తెలియడంతో అతని భార్య విజయ డెడ్ బాడీ వద్ద బోరున విలపించింది. తన భర్తను ఎవరో పథకం ప్రకారం హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించారని పోలీసుల ముందు, మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేసింది. ఆమె రోదనలు చూసి గ్రామస్తులంతా భావోద్వేగానికి గురయ్యారు. అయితే ఈ ఘటన తండాలో అగ్గి రాజేసింది. హత్యకు కారణమన్న అనుమానంతో ఆర్ఎంపి భరత్‌కు చెందిన బైక్‌ను దగ్ధం చేయడంతో పాటు, ఆస్పత్రిలోని ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. పరిస్థితి చేయి దాటకుండా పోలీసులు భారీగా మోహరించాల్సి వచ్చింది. సంఘటనా స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన పోలీసులు ఇది కచ్చితంగా పథకం ప్రకారం జరిగిన హత్యేనని నిర్ధారణకు వచ్చారు. టెక్నాలజీ ఆధారంగా సెల్‌ఫోన్ కాల్ డేటా, కదలికల ఆధారాలను విశ్లేషించి కేవలం 24 గంటల్లోనే అసలు నిందితులను గుర్తించారు. మృతుడి భార్య విజయ, ఆమె ప్రియుడు బాలాజీ, ఆర్ఎంపి భరత్‌లే ఈ హత్యకు పాల్పడ్డారని పోలీసులు తేల్చారు.

వేద న్యూస్

శుక్రవారం డిసెంబర్ 26, 2025

# క్రిస్మస్ వేడుకల్లో ఎలుపేట్ సర్పంచ్



**వేద న్యూస్, టేక్మాల్:**

మెదక్ జిల్లా టేక్మాల్ మండల్ పరిధిలోని ఎలుపేట్ చర్చ్‌లో పాస్టర్ నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో ఎలుపేట్ సర్పంచ్ ఎల్లారెడ్డి గారి మాధవి నర్సింహా రెడ్డి పాల్గొ న్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించు కొని శాంతి, సౌభ్రాతృత్వం, సమాజ హితం కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ప్రభు యేసు క్రీస్తు ప్రేమ, త్యాగం, క్షమాభావం అనే మహోన్నత విలువలను ప్రపంచానికి అందించిన మహానుభావుడని తెలిపారు. యేసు క్రీస్తు బోధించిన శాంతి, సేవ, సోదరభావం నేటి సమాజానికి అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు ఆ ఆదర్శాలను ఆచరిస్తూ మత సామరస్యాన్ని కాపాడుతూ శాంతి యుత జీవనం సాగించాలని ఆకాంక్షించారు. అనంతరం చర్చ్ ప్రాంగణంలో భక్తులతో సాదరంగా ముచ్చటించి, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.

# గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- సింగారం సర్పంచ్ ప్రమీల బాలరాజు
- నూతన పాలకవర్గానికి సన్మానం

**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట:**

ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామంలో ప్రజలు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, గ్రంథాలయం అభివృద్ధికి, గ్రామాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని సింగారం గ్రామ సర్పంచ్ ముత్యాల ప్రమీల బాలరాజు అన్నారు. సింగారం గ్రామంలో స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నిక కాబడిన సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యుల పాలకవర్గాన్ని శాలువాలతో ఘనంగాసన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రజలు గ్రంథాలయాన్ని ఉపయోగించుకోవాలని, యువత పోటీ పరీక్షలకు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గనగోని ధర్మాగౌడ్, వార్డుల సభ్యులు రామచంద్రం, అంజయ్య, బంటి, మేఘన, మానస, భవానీ, సింగారం స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు



కోల నారాయణ గౌడ్, ప్రధాన కార్యదర్శి షేక్ ఉస్మాన్, ఉపాధ్యక్షులు డా. వాసరవేణి పర్శరాములు, ముత్యాల బాలరాజు, గ్రంథాలయం ఇంచార్జ్ గొరిటం శ్రీనివాస్, సంస్థ సభ్యులు గనగోని మల్లేశం, షేక్ గఫార్, పుటకుల్ల అంజయ్య, షేక్ మహబూబ్, ముష్కం దేవయ్య, కస్తూరి అశోక్, గనగోని తిరుపతి, ఎల్లం, జి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# యేసు విలువలు స్ఫూర్తిదాయకం

- ప్రభువు బోధనలు ప్రజా ప్రభుత్వానికి ప్రేరణ
- అన్ని మతాల సంక్షేమానికి సర్కార్ కట్టుబడి ఉంది
- క్రైస్తవ సోదరులకు సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

క్రిస్మస్ పర్వదినం సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి క్రిస్టియన్ సోదర, సోదరీమణులందరికీ హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రవ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలను ఆనందంగా, సంతోషంగా జరుపుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఏసు ప్రభువు బోధనలు మానవత్వం, త్యాగం, ప్రేమ అనే విలువలను ప్రపంచానికి చాటాయని పేర్కొన్నారు. ఆ బోధనల స్ఫూర్తితోనే ప్రజా ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాల సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మత ప్రాతిపదికన ఎలాంటి వివక్ష లేకుండా, ప్రతి వర్గానికి సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా చర్చిల్లో



ప్రత్యేక ప్రార్థనలు, వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి ఈ పండుగను ఉత్సాహంగా జరుపుకుంటూ పరస్పర శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

# సర్పంచుల ఫోరం కార్యవర్గం ఎన్నిక

- అభినందించిన ఎమ్మెల్యే

**వేదన్యూస్, గంగాధర:**



గంగాధర మండల సర్పంచుల ఫోరం నూతన కార్యవర్గాన్ని గురువారం మండలంలోని మధురానగర్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫోరం అధ్యక్షునిగా ఉప్పరమల్యాల సర్పంచ్ ముద్దం నగేష్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా మధురానగర్ సర్పంచ్ వేముల భాస్కర్, కాసారం సర్పంచ్ వేముల జ్యోతి దామోదర్, కొండాయపల్లి సర్పంచ్ మల్యాల వినయ్ సాగర్‌లను ఎంపిక చేశారు. ప్రధాన కార్యదర్శిగా కొండన్నపల్లి సర్పంచ్ రేండ్ల శ్రీనివాస్, కోశాధికారిగా బూరుగుపల్లి సర్పంచ్ దూలం కళ్యాణ్ కుమార్ ఎన్నికయ్యారు.కార్యదర్శులుగా లక్ష్మీదేవిపల్లి సర్పంచ్ బాసవేణి శ్రీనివాస్, కురిక్యాల సర్పంచ్ కదారి రేణుక కనకయ్య, ర్యాలపల్లి సర్పంచ్ బీ.కొండ బాబలక్ష్మీ మధు నియమితులయ్యారు. లీగల్ సెల్ అడ్వైజర్స్‌గా చర్లపల్లి (ఆర్) సర్పంచ్ ఎట్టెకు కనకయ్య, నాగిరెడ్డిపూర్ సర్పంచ్ గురుకొండ యశోద బాబు, గౌరవ అధ్యక్షులుగా తాడిజెర్రి సర్పంచ్ రామిడి రాజిరెడ్డి, ఇస్లాంపూర్ సర్పంచ్ బారాజు ప్రభాకర్ రెడ్డి, సర్వారెడ్డిపల్లి సర్పంచ్ కరబూజ తిరుపతి గౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అభినందించారు. సర్పంచులు ప్రజలతో మమేకమై గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం సభ్యులు పాల్గొన్నారు.

# మరో అగ్రనేత హతం - ఒడిషాలో భారీ ఎన్ కౌంటర్

- గణేష్ ఉయికె సహా ఆరుగురు మావోయిస్టులు మృతి
- ధృవీకరించిన ఉన్నతాధికారులు
- గణేష్ పై రూ.1.10కోటి రివార్డు
- ఉద్యమానికి మరోసారి భారీ దెబ్బ

**వేద న్యూస్, ఫోకస్ టీం:**

మావోయిస్టు ఉద్యమానికి మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఒడిశాలోని కందమాల్ జిల్లా గుమ్మా అటవీ ప్రాంతంలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టుల కీలక అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు పాకా హనుమంతు అలియాస్ గణేష్ ఉయికే హతమయ్యారు. ఈ ఘటనలో మొత్తం ఆరుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు ఉన్నతాధికారులు ధృవీకరించారు. గణేష్ ఉయికేపై రూ.1.10 కోట్ల రివార్డు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో గుమ్మా అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య తీవ్ర ఎదురుకాల్పులు జరిగాయి. నిఘా సమాచారం మేరకు ముందుకు కదిలిన బలగాలపై మావోయిస్టులు కాల్పులకు దిగగా, ఆపై జరిగిన ప్రతికాల్పుల్లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎదురుకాల్పుల అనంతరం ప్రాంతాన్ని పూర్తిగా కవర్ చేసిన బలగాలు మృతదేహాలను స్వాధీనం చేసుకుని, ఆయుధాలు, అమ్యూనిషన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

**అప్పట్లోనే చనిపోయినట్లు వార్తలు**

హతమైన గణేష్ ఉయికే అసలు పేరు పాకా హనుమంతు. ఆయన స్వస్థలం తెలంగాణలోని నల్గొండ జిల్లా చండూరు మండలం పుల్లెంల



గ్రామం. దాదాపు 40 - 45 ఏళ్లుగా మావోయిస్టు ఉద్యమంలో క్రియాశీలంగా ఉన్న ఆయన, వివిధ హోదాల్లో పనిచేస్తూ పార్టీ విస్తరణకు కీలక పాత్ర పోషించారు. కేంద్ర కమిటీ సభ్యుడిగా దండకారణ్యం - ఒడిశా బెల్ట్‌లో కార్యకలాపాలను సమన్వయం చేసిన నేతగా ఆయనకు పేరుంది. గమనార్హంగా, గతంలో ఛత్తీస్‌గఢ్‌లోని గరియాబాద్ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో గణేష్ ఉయికే మృతి చెందినట్లు అప్పట్లో పోలీసులు ప్రకటించారు. అయితే ఆ సమయంలో కుటుంబ సభ్యులు, పార్టీ వర్గాలు ఆ వార్తలను ఖండించాయి. ఇప్పుడు తాజాగా ఒడిశాలో జరిగిన ఈ ఎన్‌కౌంటర్‌లో గణేష్ ఉయికే మృతి చెందినట్లు అధికారికంగా ధృవీకరణ రావడం రాజకీయ, భద్రతా వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఎన్‌కౌంటర్‌తో ఒడిశా-దండకారణ్య ప్రాంతాల్లో మావోయిస్టు నెట్‌వర్క్‌కు గట్టి దెబ్బ తగిలిందని భద్రతా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. గత కొంతకాలంగా వరుస ఎన్‌కౌంటర్లు, అగ్రనేతల పతనంతో మావోయిస్టు ఉద్యమం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోందన్న విశ్లేషణలు మరింత బలపడుతున్నాయి.

# బ్యాటరీల దొంగలు అరెస్ట్

**వేద న్యూస్, చొప్పదండి:**




చొప్పదండి మండలం భూపాలపట్నంకు చెందిన గోగులకొండ మహేష్, తిమ్మాపూర్ మండలం నల్గొండ గ్రామనికి చెందిన నరేష్ కలిసి చొప్పదండి మండలంలో పలు వాహనాల బ్యాటరీలు దొంగలించడానికి ప్రయత్నం చేస్తుండగా వారిని పట్టుకొని పోలీసులు కేస్ నమోదు చేశారు. వివరాలలోకి వెళ్ళితే.. చొప్పదండి మండలం భూపాలపట్నంకు చెందిన గోగులకొండ మహేష్ గతంలో జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు చేసి జైలుకి వెళ్ళి వచ్చాడు. మరల కరీంనగర్లో పరిచయం అయిన అతని స్నేహితుని బావ అయిన నిషాని నరేష్, తిమ్మాపూర్ మండలానికి చెందిన నరేశ్ డబ్బులు అవసరం ఉందని మహేష్ తో చెప్పగా, స్కూటీ తీసుకొని వస్తే నీకు డబ్బులు ఇస్తా అని చెప్పాడు. దీంతో నరేష్ తన స్కూటీ తీసుకొని రాగా బుధవారం రాత్రి ఇద్దరు కలిసి ముందుగా గుమ్లాపూర్, కాట్నపల్లి, ఆర్నకొండ గ్రామాల్లో 5 బ్యాటరీలు దొంగిలించి వాటిని చొప్పదండి పట్టణంలోని స్క్రాప్ షాప్ అమ్మారు. మరల భూపాలపట్నం రోడ్డు పక్కన నిలిపిన రెండు లారీల్లో 5 బ్యాటరీలు దొంగలించడానికి ప్రయత్నించగా, లారీ డ్రైవర్ లు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. మొత్తంగా 10 బ్యాటరీలు రికవరీ చేసి కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేష్ రెడ్డి తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**వేద న్యూస్, రుద్రంగి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో గురువారం విషాదకర సంఘటన చోటు చేసుకుంది. అతివేగంగా వచ్చిన ఒక గుర్తు తెలియని వాహనం ఇద్దరు వ్యక్తులను ఢీకొట్టి ఆపకుండా వెళ్ళిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంగి మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయం సమీపంలో రోడ్డుపై వెళ్తున్న రుద్రంగి గ్రామానికి చెందిన రాములు (65), నేవూరుపల్లి చెందిన వనిత (34) లను ఒక గుర్తుతెలియని వాహనం బలంగా ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే వాహనదారుడు అక్కడి నుండి పరారయ్యాడని సమాచారం. వెంటనే స్థానికులు 108కు సమాచారం అందించగా వెంటనే ఘటనా స్థలానికి చేరుకుంది. ఈఎన్టి గణేష్ నాయక్, పైలెట్ తోట నరేందర్ గాయపడిన వారికి ప్రాథమిక చికిత్స అందించి తక్షణమే వేములవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితులకు ఆసుపత్రిలో చికిత్స అందుతోంది.

# చైనా మాంజా క్రయవిక్రయాలు చేస్తే జైలు శిక్ష..!

**వేద న్యూస్, వరంగల్ క్రైమ్ :**




పక్షులతో పాటు, ప్రజలకు ప్రమాదకరంగా మారిన చైనా మాంజాను ఎవరైనా విక్రయించినా, వినియోగించినా, వారి పట్ల కఠినంగా వ్యవహారిస్తూ చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వరంగల్ పోలీస్ కమిషనర్ హెచ్చరించారు. సంక్రాంతి పండుగ సమిపిస్తున్న వేళ యువత గాలి పటాలను ఎగురవేసేందుకు సిద్ధమవుతున్న తరుణంలో యువత అధికంగా చైనా మాంజా ఉపయోగించి గాలి పటాలను ఎగుర వేయడం ఆసక్తి కనబరుస్తారు. కాని యువత వినియోగించే చైనా మాంజా (సింథటిక్ దారం, గాజు పొడి) చాలా ప్రమాదకమని, ఈ దారాన్ని ఉపయోగించడం ద్వారా పక్షుల గొంతు, రెక్కలు తెగిపోవడం, మనుషులకు గాయాలు కావడం జరుగుతుంది. ఎవరైనా చైనా మాంజా విక్రయించినా వినియోగించినా ఏడేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంది, ఇది చట్టవిరుద్ధమని, ఈ చైనా మాంజా నియంత్రణ కై ప్రత్యేక చేపట్టడం జరుగుతుందని, ఇందులో భాగంగానే టాస్క్ ఫోర్స్ పోలీసులు హన్మకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని కుమార్ పల్లి ప్రాంతం ఆనంద్ అనే వ్యక్తి ఇంటి పై దాడి చేసి సూమారు 2 లక్షల 3 వేల రూపాయల చైనా మాంజాను స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఎవరైనా చైనా మాంజా విక్రయాలకు పాల్పడితే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని పోలీస్ కమిషనర్ ప్రజలకు సూచించారు.

# శివరాజయ్యను సత్కరించడం నా అదృష్టం

- చింతకింది గోవర్ధన్ గౌడ్

**వేద న్యూస్, శేరిలింగంపల్లి :**



ఆటల్ బిహారీ అటల్ బిహారీ వాజపేయి శతజయంతి ఉత్సవాల సందర్భంగా శేరిలింగంపల్లి బీజేపీ సీనియర్ నాయకులు శివరాజయ్యని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి చింతకింది గోవర్ధన్ గౌడ్ చందనగర్ లోని వారి నివాసానికి వెళ్ళి సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి అటల్ బిహారీ వాజపేయిగా పిలుచుకునే శివరాజయ్యని సత్కరించడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. శివరాజయ్యతో 1999 లో తాను శేరిలింగంపల్లి మండల ప్రధాన కార్యదర్శిగా వున్నప్పటినుండి వారితో అనుబంధం ఉన్నదని అన్నారు. ఆయన ఉపన్యాసాల ద్వార, పార్టికిసంబంధించిన దేశ భక్తి పాటల ద్వార కార్యకర్తల్లో ఉత్సాహాన్నింపేవారని అన్నారు.

# ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించిన ఎమ్మెల్యే బిఎల్ఆర్

**వేద న్యూస్, దామరచర్ల :**



దామరచర్ల మండలం దిలావర్ పూర్ గ్రామ పంచా యతీలోని మిట్టగూడెంలో ఎలిజాల సైదమ్మ కుచెందిన ఇందిరమ్మ ఇల్లు ను గురువారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ప్రారంభించారు.అనంతరం ఆ కుటుంబ సభ్యులు, గ్రామస్థులతో కలిసి కేక్ కట్ చేసి క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ లోకరక్షకుడు ఏసుక్రీస్తు జన్మదిన సందర్భంగా ఒక పేదకుటుంబం సొంత ఇంటి కల నెరవేర్చడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజా పాలనలో ప్రతీ సామాజిక వర్గానికి సంక్షేమాన్ని అందిస్తూ ప్రజల ఆశీర్వాదాలు అందుకుంటుంది అని అన్నారు.ఈ కార్యక్రమంలో దిలావర్ పూర్ సర్పంచ్ బెజ్జం సాయి, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా వాజ్ పాయ్ జయంతి వేడుకలు



**వేద న్యూస్, దామరచర్ల :**

మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారి వాజపేయ్ జయంతి వేడుకలను బీజేపీ ఆధ్వర్యంలో దామరచర్ల మండల కేంద్రంలోని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం. ప్రభుత్వ దవాఖానాలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మేషా నాయక్, జిల్లా కార్యవర్గ సభ్యులు జానకిరామ్ రెడ్డి, జిల్లా నాయకులు ఈగ సైదారావు, ప్రధాన కార్యదర్శి నెమలి విజయ్, మాదారబోయిన సత్యనారాయణ, గొంగడి నరసింహారెడ్డి, కృష్ణ రాజు,నాగిరెడ్డి, సైదిరెడ్డి, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# జీవాలకు నట్టల నివారణ మందుల పంపిణీ



**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

గొర్రె, మేకలకు రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంత కుంట మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామంలో నట్టల నివారణ మందుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ సర్పంచ్ గన్నేరం వసంత నరయ్య, ఉప సర్పంచ్ ఎలవేణి రమేష్ మాట్లాడుతూ.. గొర్రె మేకలు ఆరోగ్యం మెరుగ్గా ఉంటేనే గొర్రెల పెంపకదారుల జీవన భద్రత బలపడుతుందని అన్నారు. పశువుల ఆరోగ్య పరిరక్షణకు నివారణ చర్యలు ఎంతో అవసరమని, ఇటువంటి కార్యక్రమాలు పెంపకదారులకు ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ పూర్ణచంద్రిక, అసిస్టెంట్ చంద్రయ్య, వార్డు సభ్యులు లింగంపల్లి అనిల్, బండారి లావణ్య, గొర్రెలు, మేకల కాపలాదారులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అటల్ జీ జయంతి వేడుకలు



**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయం లో గురువారం దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్పేయి 101వ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ నిర్మాణం కోసం వాజ్పేయి చేసిన కృషి అమోఘం అన్నారు. ఆయన దార్శనికత్వంలో దేశం ఐక్యమత్యంగా ఉందని అన్నారు. ఆయన దృఢ సంకల్పం నేటికీ శిష్యగణం అవలంబిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ ప్రశాంత్ గౌడ్, మండల అధ్యక్షుడు ఆలపాటి హరికృష్ణ, నాయకులు పార్వతీ మురళి, వేముల గజేందర్, గణేష్, రాజశేఖర్, వడ్ల సాయినాథ్, శ్రీకాంత్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


# సొంత డబ్బులతో బోరు వేయించిన సర్పంచ్



**వేద న్యూస్, బోయినిపల్లి:**

ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలోని 9వ వార్డు ఎస్సీ కాలనీలో నూతనంగా గెలుపొందిన సర్పంచ్ నల్ల మోహన్ గురువారం సొంత నిధులతో బోరు వేయించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు సర్పంచ్ నల్ల మోహన్, ఉపసర్పంచ్లతో పాటు వార్డు సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, వార్డు మెంబెర్స్, పాల్గొన్నారు.

# వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ



**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఇల్లంత కుంట మండల కేంద్రంలో ప్రముఖ వ్యాపార వేత్తలు ముత్యం బాల గౌడ్ (కన్నెస్వామి), ముత్యం కిరణ్ గౌడ్ ఏర్పాటు చేసిన అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమానికి పెద్ద ఎత్తున అయ్యప్పస్వామి మాలా ధారులతో పాటు, భక్తులు విచ్చేశారు. దైవ సమానులు, అయ్యప్ప స్వామి గురు పూజ్యులు, రాజు గురుస్వామి ఆధ్వర్యంలో మహా పడిపూజ కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష అభిషేకాలతో పాటుగా, పేట తుళ్ళి, అన్న ప్రసాద వితరణ, పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మూగు నాగరాజుశర్మ, గురు స్వాములు ఎర్రోజు గోపాలాచారి, బిల్లా రఘువీర్, కామల్ల ఎల్లయ్య, ఎలుక దేవయ్య, ముంజ భూపతి, ఈదుల రవీందర్ రెడ్డి, సింగిరెడ్డి రమణారెడ్డితో పాటుగా, మాలధారణ, భక్తులు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్ ప్రారంభం

**– తొలి రోజే 304 మంది పట్టివేత**
**– నూతన సంవత్సర వేడుకల వేళ ముమ్మర తనిఖీలు**

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. భద్రతా చర్యల్లో భాగంగా బుధవారం నుంచి ప్రత్యేకంగా 'డ్రంక్ అండ్ డ్రైవ్' సోదాలను ప్రారంభించారు. ఈ స్పెషల్ డ్రైవ్ డిసెంబర్ 31 వరకు కొనసాగుతుందని పోలీసులు తెలిపారు. తొలి రోజైన బుధవారం ఒక్కరోజులోనే మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 304 మందిని పోలీసులు పట్టుకున్నారు. వీరిలో ఒక మైనర్ కూడా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారి నుంచి మొత్తం 304 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ ఘటనల వల్ల రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో, ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం ద్వారా తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా ప్రమాదంలోకి నెట్టవద్దని సూచించారు. నూతన సంవత్సర వేడుకలను సురక్షితంగా జరుపుకోవాలని, వాహనదారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు. మద్యం సేవించిన వారు వాహనాలు నడపకుండా ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకోవాలని సూచించారు.

# జర్నలిస్టుల విభజన సరికాదు

**– నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలి**
**– వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మహమ్మద్ రఫీ డిమాండ్**



**వేద న్యూస్, వేములవాడ:**

రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టులను రిపోర్టర్లు, డెస్క్ జర్నలిస్టులుగా విభజించడం సరికాదని, ఆ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని టీయూడబ్ల్యూజే హెచ్ – 143 వేములవాడ అధ్యక్షుడు మహమ్మద్ రఫీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ కోసం ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నెంబర్ 252ను సవరించి, డెస్క్లల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకూ అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని కోరారు. అలాగే డెస్క్ జర్నలిస్టులకు బస్ పాస్ల అంశంపై సమాచార, పౌరసంబంధాల శాఖ అధికారులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మహమ్మద్ రఫీ మాట్లాడుతూ, మీడియా రంగంలో రిపోర్టర్లు, డెస్క్ జర్నలిస్టులు ఇద్దరూ వర్కింగ్ జర్నలిస్టుల కిందికే వస్తారని తెలిపారు. అలాంటి వారిని విభజించడం సమంజసం కాదన్నారు. ఒకరిని ఎక్కువగా, మరొకరిని తక్కువగా చూసేలా మీడియా అకాడమీ, కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించడం తగదని ప్రశ్నించారు. డెస్క్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వబోమని, మీడియా కార్డుల పేరుతో కొత్త కార్డులు జారీ చేస్తామని చెప్పడం సరికాదన్నారు. ఇది డెస్క్ జర్నలిస్టులను రెండో తరగతి పౌరులుగా చూడడమేనని ఆవే దన వ్యక్తం చేశా రు. పోరాడి సాధిం చుకున్న అక్రిడిటేష న్ హక్కు ను హరించడం తగదన్నారు. ప్రస్తుతం అందుతున్న సంక్షేమ పథకాలు, భవిష్యత్తులో ప్రభుత్వం ఇవ్వాలనుకుంటున్న ఇండ్ల స్థలాల కేటాయింపుల విషయంలో స్క్రీనింగ్ చేసేందుకే ఈ విభజన అన్న అనుమానాలు జర్నలిస్టుల్లో వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ జర్నలిస్టులకు అన్ని విధాలా సంక్షేమ ఫలాలు అందించి జర్నలిస్టు పక్షపాతిగా సేవలందించారని గుర్తు చేశారు. ఈ నెల 27న రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట మాజీ ప్రెస్ అకాడమీ చైర్మన్, రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్ పిలుపు మేరకు జర్నలిస్టుల హక్కుల కోసం ఆందోళనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రెస్ అకాడమీ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఓ 252ను సవరించి జర్నలిస్టుల హక్కులను కాపాడాలని, లేనిపక్షంలో జిల్లా, మండల కేంద్రాల్లో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని మహమ్మద్ రఫీ హెచ్చరించారు. జర్నలిస్టులంతా ఈ ఆందోళన, నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# ప్రతి హిందువు భగవద్గీత నేర్చుకోవాలి

**– హిందూ సంప్రదాయాన్ని ముందు తరాలకు అందించాలి**
**– శ్రీశ్రీశ్రీ త్రిదండి దేవనాథ రామనుజ జీఆర్ స్వామి**
**– రామాయణంలోని ప్రధాన అంశాల వివరణ**



**వేద న్యూస్, చొప్పదండి:**

ప్రతి హిందువు భగవద్గీత నేర్చుకోవాలని, మన సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాలని శ్రీ శ్రీ శ్రీ త్రిదండి దేవనాథ రామానుజ జీఆర్ స్వామి అన్నారు. ఈ మేరకు చొప్పదండి పట్టణంలోని జ్ఞాన సరస్వతి ఆలయాన్ని ఆయన సందర్శించి ప్రవచనం నిర్వహించారు. ఆయనకు ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జ్ఞాన సరస్వతి సేవాదళ్ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. వేద పండితులు పంచాంగ కర్త జగన్నాథం విష్ణువర్ధనాచార్యులు, ఆలయ ప్రధాన అర్చకులు సింహాచలం జగన్మోహన్ స్వామి, శ్రీ భాష్యం నవ్య కుమారులు పూర్ణ కుంభంతో స్వాగతం సుమాంజలు పలికారు. ఈ సందర్భంగా ఆలయంలోని అమ్మవార్లను ఆయన దర్శించుకుని ఆధ్యాత్మిక చింతన ప్రవచనాలను భక్తులకు వివరించారు. రామాయణంలోని ప్రధాన ఘట్టాలలోని అంశాలను భక్తులకు చక్కగా వివరించి చెప్పారు. అమ్మతనం సీత గుణం హనుమంతుని కర్తవ్యం తదితర అంశాలపై క్షుణ్ణంగా వివరించారు ప్రతి హిందువు భగవద్గీతను నేర్చుకోవాలని, 700 శ్లోకాలలో రోజుకు రెండు శ్లోకాల ను నేర్చుకుంటే ప్రయోజనం ఉంటుందని అన్నారు. చిన్న జీయర్ స్వామి ఆధ్వర్యంలో వీటిని నిర్వహిస్తున్నారని వీటిని భక్తులు వినియోగించుకోవాలని కోరారు. చరవాణి ద్వారా మంచిని నేర్చుకోవాలని చెడును వదిలిపెట్టాలని తెలిపారు. భారతీయ హిందూ సంస్కృతి ప్రపంచంలోనే చాలా గొప్పదని మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జ్ఞాన సరస్వతి ఆలయానికి అనుబంధంగా కొనసాగుతున్న జ్ఞాన సరస్వతి సేవాదళ్ సభ్యులు బృందాలు గత కొన్ని సంవత్సరాలుగా రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలలో సేవలను అందించడంతో వారికి ప్రశంస పత్రాలను అందజేసి ఆశీర్వాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ గుర్రం నీరజ భూమా రెడ్డి, గుర్రం ఆనంద రెడ్డి, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, తిప్పర్తి శ్రీనివాస్, కూర్మాచలం రత్నాకర్, ఎన్ ప్రేమ్ సాగర్ పలువురు జ్ఞాన సరస్వతి సేవ సభ్యులు భక్తులు పాల్గొన్నారు. భక్తులందరికీ ఆశీర్వచనాలను అందజేశారు.

# పూర్వం నుంచి బొందల బండలో కబ్జాలో ఉన్నాం



**– దేశబోయిన వంశస్థులు వెంకటయ్య, సైదులు**

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**

వేములపల్లి మండల కేంద్రంలోని ఆమనగల్లు గ్రామంలో సర్వేనెంబర్ 1లోని పూర్వం నుంచి నాగులమ్మ గుడి వద్ద దహన సంస్కారాల కోసం కబ్జాలో ఉన్నామని దేశ బోయిన వంశస్థులు వెంకటయ్య, సైదులు పేర్కొన్నారు. గురువారం వేములపల్లి మండల కేంద్రంలోని ఆమనగల్లు గ్రామంలో తన నివాసంలో ఏర్పాటుచేసి విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పూర్వం నుండి నాగులమ్మ గుడి వద్ద దేశబోయిన వంశస్థులు ఎవరైనా చనిపోతే దహన సంస్కారాలు కోసం వినియోగించారని అన్నారు. వందేళ్ల క్రితం మా వంశస్థులు చనిపోతే నాగులమ్మ గుడి వద్దనే దహన సంస్కారాలు చేసేవారని వారు గుర్తు చేశారు. అయితే సర్వే నెంబర్ 1లో ప్రస్తుతం 20 ఎకరాల భూమిలో పూర్తిగా గడ్డివాములతో నిండిపోయిందని వారు ఆరోపించారు. భూమిని గ్రామానికి చెందిన కొంతమంది అన్యాక్రాంతం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికే ఆమనగల్ గ్రామంలో సర్వేనెంబర్1లో ఎంతోమంది ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని, అయినప్పటికీ పట్టించుకునే నాధుడే కరువయ్యారని వాపోయారు. ప్రస్తుతం నాగులమ్మ గుడిని కూడా అన్యాక్రాంతం చేస్తున్న క్రమంలో కాపాడుకునేందుకు ప్రయత్నించామని తెలిపారు. సర్వే నెంబర్ 1లో గడ్డివాములతో నిండిన శాశ్వత నిర్మాణాలను కూడా తొలగించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో దేశబోయిన వంశస్థులు సైదులు, వెంకటయ్య, రవి వెంకట్, సాయి, వేణు తదితరులు పాల్గొన్నారు.

# క్రీస్తు మార్గం అందరికీ అనుసరణీయం

**– బాప్టిస్ట్ చర్చిలో ఘనంగా వేడుకలు**

**వేద న్యూస్, కమలాపూర్:**



హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని తెలుగు బాప్టిస్ట్ చర్చిలో పుల్ల నవీన్ అధ్యక్షతన క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి హాజరై ఏసుక్రీస్తు బోధించిన శాంతి సందేశాన్ని, ఏసుక్రీస్తు జీవిత చరిత్ర గురించి తెలియపరిచారు. అనంతరం పీఎన్ మూర్తి క్లాత్ స్టోర్ వారు స్పాన్సర్ చేసిన చీరెలను నిరుపేద క్రిస్టియన్లకు అందజేశారు. అనంతరం ఆలిండియా యూనివర్సిటీ ఎంప్లాయిస్ కాన్ ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు పుల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆపదలో, అవసరంలో ఉన్న వ్యక్తికి మనకున్న దాంట్లో కొంత సాయం అందించడం, ప్రతి ఒక్కరికి ప్రేమను పంచడం, ప్రేమతోనే జీవించడం, తద్వారా సమాజాన్ని ప్రేమమయంగా మార్చడం ఇవన్నీ క్రీస్తు బోధనలో భాగమని వాటిని ఈ యువతరం ఆచరిస్తే వారి భవిష్యత్తు బాగుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కమలాపూర్ సర్పంచ్ పబ్బు సతీష్, ఉప సర్పంచ్ పుల్ల శ్రీనివాస్, దేశరాజ్ పల్లి గ్రామ సర్పంచ్ మిట్టపల్లి మహేశ్వరి, కమలాపూర్ గ్రామానికి చెందిన వార్డ్ మెంబర్లు మౌటం రమేష్, పుల్ల ఐలయ్య, పుల్ల శ్రీను, మాజీ ఎంపీటీసీ మాట్ల వెంకటేశం తదితరులు పాల్గొని కేక్ కట్ చేసి ప్రజలందరికీ క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

వేద న్యూస్



# నేవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో విమాన సేవలు ప్రారంభం

- డిసెంబర్ 25 నుంచి అధికారికంగా ఫ్లైట్ ఆపరేషన్లు
- దేశ విమానయాన మౌలిక సదుపాయాలకు కీలక మైలురాయి
- కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసిన సీఐఎస్ఎఫ్

**వేద న్యూస్, నేవీ ముంబై ప్రతినిధి:**

నేవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో గురువారం నుంచి అధికారికంగా విమాన సేవలు ప్రారంభమయ్యాయి. దీంతో భారతదేశ విమానయాన మౌలిక సదుపాయాలు మరింత బలోపేతం కావడంతో పాటు, ప్రాంతీయ కనెక్టివిటీకి గణనీయమైన ఊతం లభించిందని అధికారులు తెలిపారు. విమానాశ్రయంలో భద్రతా ఏర్పాట్లను సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) కట్టుదిట్టంగా అమలు చేస్తోంది. బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ మార్గదర్శకాలకు అనుగుణంగా సమగ్ర భద్రతా చర్యలు చేపట్టి, విమానాల రాకపోకలు సురక్షితంగా, సమర్థవంతంగా జరిగేలా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. వృత్తిపరమైన నైపుణ్యం, పూర్తి సిద్ధతతో సీఐఎస్ఎఫ్ సిబ్బంది విమానాశ్రయ భద్రతను పర్యవేక్షిస్తున్నారని



తెలిపారు. ప్రయాణికుల భద్రతతో పాటు విమానాశ్రయ ఆస్తుల రక్షణకు అత్యున్నత ప్రమాణాలతో పని చేస్తున్నట్లు పేర్కొన్నారు.ప్రపంచస్థాయి మౌలిక వసతులతో రూపుదిద్దుకుంటున్న నేవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం విమాన సేవల ప్రారంభంతో దేశ విమానయాన రంగంలో కీలక పాత్ర పోషించనుందని అధికారులు అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో దేశీయ, అంతర్జాతీయ విమాన రాకపోకలు మరింత పెరగనున్నట్లు వెల్లడించారు.

# అనాథ విద్యార్థుల భోజనానికీ నోచని ప్రభుత్వం



**సిద్దిపేట, వేద న్యూస్ :**

- కాంగ్రెస్ పాలనపై హరీశ్ రావు తీవ్ర విమర్శలు
- బిల్లులు చెల్లించకపోతే ఉద్యమాలు తప్పవని హెచ్చరిక

హరీశ్ రావు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై మరోసారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అనాథ విద్యార్థులకు సమయానికి భోజనం కూడా అందించలేని దయనీయ పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని విమర్శించారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా సిద్దిపేటలో అనాథ విద్యార్థులను కలిసిన హరీశ్ రావు, వారి సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. గురుకులాలు, కస్తూర్బా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సంబంధించిన మెస్ బిల్లులు, కాస్మటిక్ చార్జీలు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వం కమీషన్లకే ప్రాధాన్యం ఇస్తోందని, కమీషన్ లేని పనులను కావాలని ఆలస్యం చేస్తున్నట్లు ఆరోపించారు. విద్యార్థులు కమీషన్లు ఇవ్వలేరు కాబట్టే వారి బిల్లులు చెల్లించడం లేదేమోనని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. విద్యార్థుల బిల్లుల విషయంలో గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి గొప్పలు చెప్పారని, కానీ ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదని మండిపడ్డారు. మాటలు మాత్రం ఆకాశాన్ని తాకుతాయని, చేతలు మాత్రం గడప కూడా దాటవని ఎద్దేవా చేశారు. సీఎం ఒకేసారి ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రిగా ఉన్నా సమస్యలు పరిష్కారం కాకపోవడం పాలనా వైఫల్యానికి నిదర్శనమన్నారు.ప్రభుత్వం తీరుపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం పెరుగుతోందని హరీశ్ రావు హెచ్చరించారు. కేసీఆర్ ప్రెస్‌మీట్ తర్వాత కాంగ్రెస్ నేతల్లో భయం మొదలైందని, అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేని పరిస్థితిలో ఉన్నారని విమర్శించారు. విద్యార్థుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, లేకపోతే ఉద్యమాలు తప్పవని స్పష్టం చేశారు. విద్య, సంక్షేమ రంగాలను నిర్లక్ష్యం చేస్తే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

# కృష్ణా జలాల పేరుతో దారి మళ్లింపు



**హైదరాబాద్ వేద న్యూస్ :**

- కేసీఆర్‌కు మాట్లాడే నైతిక హక్కు లేదు
- కాళేశ్వరం స్కాం నుంచి తప్పించుకునే యత్నం
- కేంద్రమంత్రి, బీజేపీ నేత బండి సంజయ్

కృష్ణా నదీ జలాల అంశంపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న వ్యాఖ్యలను కేంద్రమంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ తీవ్రంగా ఖండించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో వెలుగుచూస్తున్న స్కాంల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే కేసీఆర్ ఇప్పుడు కృష్ణా జలాల అంశాన్ని తెరపైకి తీసుకొస్తున్నారని ఆరోపించారు. ఈ అంశంపై మాట్లాడే నైతిక హక్కు కేసీఆర్‌కు లేదని స్పష్టం చేశారు. కృష్ణా నదీ జలాల పంపకాల్లో తెలంగాణకు రావాల్సిన వాటాను కేసీఆర్ తాకట్టు పెట్టారని బండి సంజయ్ విమర్శించారు. తెలంగాణకు 575 టీఎంసీల కోసం పోరాడాల్సిన సందర్భంలో కేవలం 299 టీఎంసీలకే ఒప్పందం చేసుకోవడం రాష్ట్రానికి జరిగిన ఘోర అన్యాయమన్నారు. ముడుపుల కోసమే తెలంగాణ ప్రయోజనాలను బలి చేశారని ఆరోపిస్తూ, ఈ విషయాలను ఆధారాలతో సహా తానే బయటపెట్టినట్లు చెప్పారు. అప్పట్లో ఏపీ మాజీ సీఎం జగన్‌తో ఏం ఒప్పందం జరిగిందో ప్రజలకు కేసీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న సమయంలో తానే అపెక్స్ కౌన్సిల్ సమావేశాన్ని జరిపించానని బండి సంజయ్ గుర్తు చేశారు. కృష్ణా జలాల విషయంలో కేసీఆర్ పాత్ర పూర్తిగా ద్రోహపూరితమని విమర్శించారు. ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టులో వెలుగులోకి వస్తున్న అక్రమాల నుంచి తప్పించుకోవడానికే కొత్త ఇష్యూ తెరపైకి తీసుకొస్తున్నారని ఆరోపించారు. స్కాం నుంచి బయటపడేందుకే కృష్ణా జలాల అంశాన్ని ఆయుధంగా మారుస్తున్నారని దుయ్యబట్టారు.కేసీఆర్ కుటుంబం మొత్తం తెలంగాణకు భారంగా మారిందని బండి సంజయ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ కుమారుడు కేటీఆర్ అహంకారంతో మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇదే సమయంలో సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలపైనా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎవరి మీద విమర్శలు చేసినా మాటల తీరులో సంయమనం ఉండాలని సూచించారు. హిందూ ధర్మం ప్రతి వ్యక్తి సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటుందని పేర్కొంటూ, సీఎం రేవంత్ కూడా తన మాటలపై పునరాలోచన చేసుకోవాలని హితవు పలికారు

# విహారయాత్ర ఆనందం క్షణాల్లో విషాదం

- శంషాబాద్ వద్ద స్కూల్ బస్సు బోల్తా
- పలువురు విద్యార్థులకు గాయాలు

**హైదరాబాద్ వేద న్యూస్ :**

విహారయాత్రకు వెళ్లిన విద్యార్థుల ఆనందం ఒక్కసారిగా విషాదంగా మారింది. ఆడుతూ పాడుతూ ఉత్సాహంగా ప్రయాణిస్తున్న స్కూల్ బస్సు ప్రమాదానికి గురవడంతో పలువురు విద్యార్థులు గాయపడ్డారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్ సమీపంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని ఓ స్కూల్‌కు చెందిన సుమారు 60 మంది విద్యార్థులు జలవిహార్కు విహారయాత్రకు బయలుదేరారు. ప్రయాణంలో భాగంగా శంషాబాద్ వద్దకు చేరుకున్న సమయంలో బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదం జరిగిన క్షణాల్లోనే బస్సులో ఉన్న విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. బస్సులో చిక్కుకున్న విద్యార్థులను సురక్షితంగా బయటకు తీసి, గాయపడిన వారిని చికిత్స కోసం సమీప ఆస్పత్రులకు తరలించారు. ప్రమాదంలో పలువురికి స్వల్ప గాయాలైనట్లు అధికారులు తెలిపారు. విషయం



తెలిసిన వెంటనే విద్యార్థుల తల్లిదండ్రులు ఆస్పత్రులకు చేరుకుని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే ప్రాణ నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బస్సు బోల్తా పడటంతో శంషాబాద్ పరిసరాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడగా, పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు చర్యలు చేపట్టారు

# బాక్సింగ్ డే

## పండుగ ముగిసిన తర్వాత కూడా మిగిలే మానవత్వపు వెలుగు

- సేవకుల గౌరవంతో మొదలైన సంప్రదాయం
- కుటుంబం, సమాజం, ఐక్యతకు వేదికైన రోజు
- ఆధునిక కాలంలో బాక్సింగ్ డే ప్రాధాన్యం

**వేద న్యూస్ డెస్క్:**

క్రిస్మస్ పండుగ ఆనందం, ఆడంబరాలు, వెలుగులతో ముగిసిన వెంటనే వచ్చే డిసెంబర్ 26ను ప్రపంచంలోని అనేక దేశాలు బాక్సింగ్ డేగా పాటిస్తున్నాయి. ఇది కేవలం మరో సెలవు రోజు కాదు. పండుగ అనంతరం సమాజం తన మనస్సును ఒకసారి వెనక్కి తిప్పుకుని ఆలోచించుకునే రోజు ఇది. ఆనందం ఎవరిదాకా చేరింది? ఎవరు దూరమయ్యారు? ఎవరి శ్రమతో ఈ సంబరం సాధ్యమైంది? అనే ప్రశ్నలకు సమాధానం వెతికే రోజు బాక్సింగ్ డే.బాక్సింగ్ డే పుట్టుక బ్రిటిష్ సమాజంలోని సేవ యజమాని సంబంధాల్లో దాగి ఉంది. ఒకప్పుడు పెద్ద ఇళ్లలో పనిచేసే సేవకులు క్రిస్మస్ రోజున కూడా నిరంతరం పని చేయాల్సి వచ్చేది. పండుగ ఆనందాన్ని ఆస్వాదించలేని వారి శ్రమకు గుర్తింపుగా, యజమానులు క్రిస్మస్ తర్వాతి రోజు వారికి బహుమతులు, డబ్బు, అవసరమైన వస్తువులను పెట్టెల్లో అందించేవారు.

ఆ పెట్టెలే ఈ రోజుకు పేరుగా మారాయి. ఇది కేవలం దానం కాదు శ్రమకు గౌరవం, మనిషికి విలువ ఇచ్చే ఒక సామాజిక ప్రకటన.కాలం మారినా బాక్సింగ్ డే ఆత్మ మారలేదు. సేవకులకే కాకుండా, సమాజంలోని బలహీన వర్గాలవైపు చూపు తిప్పే రోజుగా ఇది రూపాంతరం చెందింది. పండుగ సమయంలో ఎక్కువగా మాట్లాడని పేదరికం, అసమానతలు, నిర్లక్ష్యం వంటి అంశాలను ఈ రోజు మన ముందుకు తీసుకువస్తుంది. అనేక దేశాల్లో ఈ రోజున దాతృత్వ కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు, స్వచ్ఛంద సేవలు నిర్వహించడం ఒక సంప్రదాయంగా మారింది. పండుగ ఆనందం ఒక్క ఇంటి గడప దాటాలి అనే భావనకు ఇది నిలువెత్తు నిదర్శనం.కుటుంబ సంబంధాల పరంగా కూడా బాక్సింగ్ డే ప్రత్యేకమైనది.

క్రిస్మస్ రోజున ఉన్న సందడి, ఆర్భాటం తగ్గిన తర్వాత, మరుసటి రోజు కుటుంబ సభ్యులు ప్రశాంతంగా కలిసి కూర్చునే అవకాశం లభిస్తుంది. మాట్లాడని మాటలు, పంచుకోని భావాలు, మరిచిపోయిన అనుబంధాలు ఈ రోజున మళ్లీ గుర్తుకు వస్తాయి. బహుమతుల కంటే సమయం విలువైనదని, మాటల కంటే మౌనం కూడా బంధాలను బలపరుస్తుందని ఈ రోజు నిశ్శబ్దంగా నేర్పుతుంది.క్రీడలు బాక్సింగ్ డేకు మరో ప్రత్యేక గుర్తింపును అందించాయి. క్రికెట్, ఫుట్‌బాల్ వంటి క్రీడలు ఈ రోజున పెద్ద ఎత్తున జరుగుతాయి. స్టేడియాలు, టెలివిజన్లు, ఇళ్లలో కుటుంబాలు కలిసి క్రీడలను ఆస్వాదించడం ఒక సామాజిక వేడుకగా మారింది. ఇది కేవలం వినోదం మాత్రమే కాదు భిన్న వర్గాలు, భిన్న అభిప్రాయాలు కలిగిన ప్రజలను ఒక్కచోట చేర్చే ఒక సామాజిక శక్తి. క్రీడల ద్వారా ఐక్యతను పెంపొందించే రోజు ఇది.

ఆధునిక కాలంలో బాక్సింగ్ డే ప్రాధాన్యం మరింత పెరిగింది. వినియోగవాదం పెరిగిన ఈ యుగంలో, పండుగలంటే కొనుగోళ్లు, ఆఫర్లు, పోటీలు అన్న భావన బలపడుతోంది. ఈ నేపథ్యంలో బాక్సింగ్ డే ఒక విరామం లాంటిది. “ఎంత ఖర్చు చేశాం?” కంటే “ఎవరికి సహాయం చేశాం?” అనే ప్రశ్న వేయించే రోజు ఇది. మన ఆనందానికి మూలం ఇతరుల శ్రమేనన్న సత్యాన్ని గుర్తు చేసే రోజు ఇది.భారతదేశంలో బాక్సింగ్ డేను అధికారికంగా పెద్దగా పాటించకపోయినా, ఈ రోజు ఇచ్చే సందేశం మన సమాజానికి అత్యంత అవసరం. పండుగల సమయంలో ఆడంబరాలకు ప్రాధాన్యం పెరుగుతున్న ఈ కాలంలో, సేవకులు, కార్మికులు, రోజువారీ కూలీలు చేసే కృషిని గుర్తించడం చాలా ముఖ్యం. వారి శ్రమ లేకుండా ఏ పండుగ కూడా సంపూర్ణం కాదన్న నిజాన్ని బాక్సింగ్ డే మనకు మళ్లీ గుర్తు చేస్తుంది.మొత్తానికి బాక్సింగ్ డే ఒక తేదీ కాదు, ఒక ఆలోచన. పండుగ ముగిసిన తర్వాత కూడా మానవత్వం మిగలాలి అనే సందేశం. బహుమతుల పెట్టెల కన్నా గొప్పది మన మనసు తెరవడం అనే భావన. సమాజంలో చివరి వ్యక్తి వరకు ఆనందం చేరినప్పుడే పండుగకు నిజమైన అర్థం ఉంటుందన్న సత్యానికి బాక్సింగ్ డే ఒక మౌనమైన కానీ బలమైన గుర్తు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామాలు

- జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు నిందితుల పిలుపు
- పెన్ డ్రైవ్ ఆధారాలపై కొనసాగుతున్న సిట్ విచారణ



**హైదరాబాద్ వేద న్యూస్ :**

ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితులుగా ఉన్న ప్రణీత్ రావు, భుజంగరావు, రాధాకిషన్ రావు, తిరుపతన్నలను సిట్ అధికారులు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విచారణ చేపట్టారు. నేటితో ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు విచారణ ముగియనున్న నేపథ్యంలో, అందరినీ ఒకేసారి విచారిస్తూ దర్యాప్తును మరింత వేగవంతం చేశారు. ఈ విచారణలో భాగంగా సిట్ అధికారి, రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా సిట్ కార్యాలయానికి చేరుకుని విచారణను పర్యవేక్షించారు. నేటితో ప్రభాకర్ రావుపై విధించిన 14 రోజుల పోలీస్ కస్టడీ ముగియనుండగా, ఆయనను రేపు ఉదయం 10 గంటలకు కస్టడీ నుంచి విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు.అయితే 14 రోజుల విచారణలో ప్రభాకర్ రావు సిట్ ఎదుట ఏమి వెల్లడించారన్న అంశంపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ కేసుకు సంబంధించిన అనేక కీలక ప్రశ్నలకు ఆయన స్పష్టమైన సమాధానాలు ఇవ్వలేదన్న ప్రచారం సాగుతోంది. దర్యాప్తులో భాగంగా సిట్ అధికారులు ఒక పెన్ డ్రైవ్‌ను అత్యంత కీలక ఆధారంగా పరిగణిస్తున్నారు. ప్రభాకర్ రావు ఎస్ఐబీ చీఫ్‌గా పనిచేసిన కాలంలో ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన వివరాలు పెన్ డ్రైవ్‌లో భద్రపరచినట్లు సిట్ గుర్తించింది. సుమారు ఆరు వేల ఫోన్ నంబర్లు ఉన్న డేటాను ప్రభాకర్ రావు ముందు ఉంచి విచారించినప్పటికీ, ఆయన నుంచి స్పష్టమైన వివరణ రాలేదని సమాచారం. ఈ అంశమే కేసులో తదుపరి దర్యాప్తుకు కీలకంగా మారనుందని అధికారులు భావిస్తున్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073